

నేడు సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించనున్నారు. సర్వమానవాళి శ్రేయస్సు కోసం ఈ కార్యక్రమం జరుగుతుంది.



చిన్న తిరునాళ్లకు పక్కాగా ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ చిన్న తిరునాళ్లకు చక్కగా ఏర్పాట్లుచేయాలని ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. మార్చి 7 నుంచి 11 వరకు జరిగే ఉత్సవాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు.



మహాదేవునికి సూర్యకిరణాభిషేకం

చినగంజాం: గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయంలో శనివారం మూలవిరాట్‌ను సూర్యకిరణాలు అభిషేకించాయి. భక్తులు ఈ దృశ్యాన్ని చూసి తరించారు.

న్యూస్‌రీల్


28న సీఎం జగన్ తెనాలి పర్యటన



తెనాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెనాలి పర్యటనలో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. ముందుగా నిర్ణయించినట్లుగా ఈ నెల 27వ తేదీ కాకుండా 28వ తేదీ సీఎం పర్యటన ఉంటుందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రకటించారు. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి తెనాలికి చేరుకుంటారని, వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే సభలో రైతులకు నాలుగో సంవత్సరం మూడో విడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయం, ఇటీవల వంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ చేస్తారని వివరించారు. ఈ నేపథ్యంలో శనివారం మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న బహిరంగ సభా వేదిక, హెలిప్యాడ్ వద్ద జరిగే పనులను వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ సి.హరికిరణ్, జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి పరిశీలించారు. వీరితో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, తెనాలి డీఎస్పీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ ఉన్నారు. అనంతరం తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీఎం పర్యటనపై జిల్లా కలెక్టర్ ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

7న దివ్య రథోత్సవం



మంగళగిరి: పానకాల లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమై మార్చి 7వ తేదీ వరకు జరుగనున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు నేతృత్వంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి పెండ్లి కుమారుడి ఉత్సవంతో ప్రారంభం కానున్నాయి. 27వ తేదీ రాత్రి 8 గంటలకు ధ్వజారోహణం, 6వ తేదీ రాత్రి 12 గంటలకు స్వామివార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 7న ఉదయం 6 గంటలకు బంగారు గరుడోత్సవం, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దివ్య రథోత్సవం నిర్వహించనున్నారు.

మార్చి 8 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

ఎఫ్‌ఏ–4కు బదులుగా ప్రీ–ఫైనల్ పరీక్ష



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చి 8 నుంచి 16వ తేదీ వరకు ప్రీ–ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ప్రీ–ఫైనల్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేలా పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ద్వారా పబ్లిక్ పరీక్షల మాదిరిగా ఆరు పేపర్ల విధానంలో రూపొందించిన ప్రశ్నపత్రాలతో ప్రీ–ఫైనల్ పరీక్షలు జరుగుతాయి. మార్చి నెలాఖరులో నిర్వహించాల్సిన ఎఫ్‌ఏ–4 పరీక్షలను రద్దు చేసి, వాటి స్థానంలో ప్రీ–ఫైనల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ మేరకు హెచ్‌ఎంలు, ఉప విద్యాశాఖాధికారులు, డీఈవోలు తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు మార్గదర్శకాలు విడుదల చేశారు.

‘అగ్రిమెంట్స్’కు హక్కులు

2021 నవంబర్ వరకు జరిగిన సాదా బైనామాలను హక్కు పత్రాలుగా పరిగణిస్తూ దశాబ్దాల రైతుల సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోంది. అన్ రిజిస్టర్ అగ్రిమెంట్ల ద్వారా భూములు కొనుగోలు చేసుకున్న రైతులు, తర్వాత వారి వారసుల అనుభవంలో ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో హక్కుదారులు కాలేకపోయారు. వీరికి పట్టాదారు పాసుపుస్తకాలు రాని పరిస్థితి. ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఈ నేపథ్యంలో పాత అగ్రిమెంట్లను అధికారిక హక్కు పత్రాలుగా గుర్తిస్తూ రైతులకు హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- సాదా బైనామాల ద్వారా భూముల కొనుగోలు
- ఆ భూములపై శాశ్వత హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు
- ప్రభుత్వ నిర్ణయంతో దశాబ్దాల నాటి సమస్యలకు పరిష్కారం



పాకాలపాడులో సాదా బైనామాలపై అవగాహన పొందుతున్న రైతులు

సత్తెనపల్లి: దశాబ్దాల తరబడి రెవెన్యూ శాఖలో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే భూముల రీ–సర్వే వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమం ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా ముందుకు సాగుతోంది. మరోపక్క నిషేధిత భూములు (22ఏ) సమస్యల పరిష్కారానికి కూడా ఆదేశాలు ఇచ్చింది. ఇదే సమయంలో మరో రెవెన్యూ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంది. దశాబ్దాల తరబడి రైతులు ఎదురుచూస్తున్న 'సాదా బైనామా' సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసింది.

దీంతో సాదా బైనామా సమస్యలు పరిష్కారమై సంబంధిత వ్యవసాయ భూములపై శాశ్వత హక్కులు దక్కనున్నాయి. గతంలో తెల్ల కాగితాలు, స్టాంప్ పేపర్ల మీద వ్యవసాయ భూ లావాదేవీల అగ్రిమెంట్లు జరిగాయి. ఇటువంటి సాదా బైనామా లావాదేవీల భూములపై అధికారికంగా ఎటువంటి యాజమాన్య హక్కులు ఉండవు. రెవెన్యూ శాఖలో ఆన్‌లైన్ కావు. ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడం కూడా కుదరదు. ఇలా దశాబ్దాల క్రితం నుంచి జరిగిన లావాదేవీలు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించి హక్కులు కల్పించాలని రైతులు సంవత్సరాల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే గత ప్రభుత్వాలు వీటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సమస్యలుగా మిగిలిపోయాయి. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించేందుకు తగిన మార్గదర్శకాలను జారీ చేసింది.

దశాబ్దాలుగా పెండింగ్..

ఈ సాదా బైనామాల సమస్య ఇప్పటిది కాదు. దశాబ్దాల తరబడి పరిష్కారం కాని సమస్యగా రెవెన్యూ శాఖలో నిలిచిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. 2021 నవంబర్ వరకు జరిగిన సాదా బైనామాలకు అనుమతి ఇచ్చింది. ఈ మార్గదర్శకాలు ఆధారంగా రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కారానికి కసరత్తు చేస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

పల్నాడు జిల్లాలో సాదా బైనామా సమస్యలు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులు భారీగా పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో సాదా బైనామా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మండలాల వారీగా సాదా బైనామాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

2021 నవంబర్ వరకు జరిగిన అగ్రిమెంట్లకే



2021 నవంబర్ వరకు జరిగిన సాదా బైనామా లావాదేవీలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ ఏడాది డిసెంబర్ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐదు ఎకరాల లోపు భూమి ఉండే సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఆపై భూమి ఉండే రైతులు మార్కెట్ ధర ప్రకారం రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు.

– కె.నగేష్, తహసీల్దార్, సత్తెనపల్లి



'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫైనల్స్, బహుమతి ప్రదానోత్సవం వడ్లమూడి విజ్ఞాన్ కళాశాలలో శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

– గుంటూరు వెస్ట్/ చేబ్రోలు

-10లో

దాచేపల్లిలో వ్యక్తి దారుణ హత్య

- కర్రతో కొట్టి చంపి శరీరాన్ని గొడ్డలితో 14 ముక్కలు చేసిన వైనం
- డీజిల్ పోసి మృతుడి శరీర భాగాలను తగులబెట్టిన నిందితుడు
- హత్యకు ఉపయోగించిన కర్ర, గొడ్డలి స్వాధీనం



కోటేశ్వరరావు (ఫైల్)

దాచేపల్లి: దాచేపల్లిలో దారుణ హత్య జరిగింది. ఓ వ్యక్తిని కర్రతో కొట్టి చంపి శరీర భాగాలను ముక్కలుగా చేసి తగులబెట్టిన దారుణ సంఘటన చోటుచేసుకుంది. సీఐ షేక్ బిలాలుద్దీన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దాచేపల్లి నగర పంచాయతీలో గరికపాటి కోటేశ్వరరావు (43) పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య దుర్గమల్లేశ్వరి, కుమారుడు శివశంకర్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంచికల్లులో ఉంటున్నాడు. రాత్రి అద్దాలగడ్డలోని వాటర్ ట్యాంక్ వద్ద వాల్ కట్టేసి వస్తానని ఇంట్లో చెప్పి కోటేశ్వరరావు వెళ్లాడు. అప్పటికే అక్కడ వేచిఉన్న మరో పంప్ ఆపరేటర్, నిందితుడు ఐంబోతుల సైదయ్య తన భార్య పట్ల అసభ్యకరంగా ఎందుకు ప్రవర్తిస్తున్నావని ప్రశ్నించాడు. కోటేశ్వరరావు తలపై సైదయ్య కర్రతో బలంగా కొట్టాడు. మరణించాడని నిర్ధారించుకుని సైదయ్య ఇంటికెళ్లి కుమారుడు నాగరాజుకు విషయం చెప్పి డీజిల్, గోనె సంచితో వచ్చాడు. కోటేశ్వరరావు మృతదేహాన్ని నాగరాజు, సైదయ్య గోనెసంచిలో పెట్టుకొని ద్విచక్ర వాహనంపై ఆదర్శ పాఠశాల సమీపంలోని పొలంలోకి తీసుకెళ్లారు. గొడ్డలితో శరీరాన్ని 14 ముక్కలు చేశాడు. శరీర భాగాలపై పత్తికట్టెను వేసి డీజిల్ పోసి నిప్పు పెట్టాడు. కోటేశ్వరరావు శరీర భాగాలన్నీ మంటల్లో కాలిబూడిద కాగా, కాలిపాదం మాత్రం కాలిపోలేదు. రాత్రి 11 గంటలైనా కోటేశ్వరరావు ఇంటికి రాకపోవటంతో తమ్ముడు సైదారావు, కుమారుడు శివశంకర్ వెతుకులాట ప్రారంభించారు. ఆదర్శ పాఠశాల సమీపంలో సైదయ్యను గమనించి కోటేశ్వరరావు ఎక్కడని ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకుండా వెళ్లిపోయాడు. సైదయ్య పొలంలో మంటల పక్కనే కాలిపాదాన్ని గుర్తించారు. దీంతో కోటేశ్వరరావు మృతదేహంగా భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సైదయ్య, అతని కుమారుడు నాగరాజు, సైదయ్య భార్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. హత్యకు ఉపయోగించిన కర్ర, గొడ్డలి, కాలిపాదాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోటేశ్వరరావును హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబం, రజక సంఘం నాయకులు కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై శనివారం ఆందోళనకు దిగారు. చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడు కోటేశ్వరరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బిలాలుద్దీన్ తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య




భార్యాభర్తల మధ్య చిన్నపాటి విభేదాలు వచ్చాయి. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. ఇరు కుటుంబాల పెద్దలు సర్ది చెప్పడంతో కొద్దికాలంగా దంపతులు కలిసే కాపురం చేస్తున్నారు. పుట్టింటి వద్ద ఉన్న రెండేళ్ల కాలంలో ఓ యువకుడితో ఆమెకు వివాహేతర బంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో యువకుడు ఇంటికి వచ్చిపోతుండటం, భార్య తరచూ ఎక్కడికో వెళ్లి వస్తుండటంతో అనుమానం వచ్చిన భర్త ఆమెను పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించాడు. దీంతో భర్తను అడ్డు తొలగించుకోవాలని భావించిన భార్య, ప్రియుడితో కలిసి హత్య చేయించింది.

అనుమానమే పెనుభూతమై..



ఉపాధి కోసం ముగ్గురు పిల్లలతో పట్టణానికి వచ్చారు ఆ దంపతులు. ఇద్దరూ రోజువారీ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అధిక సంతానానికి తోడు భర్త మద్యానికి బానిస కావడంతో ఖర్చులు పెరిగాయి. వీరుంటున్న ఇంటి పక్కనే భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళ వేరే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. వీరి ఇబ్బందుల్ని గుర్తించి ఆమె పలుమార్లు డబ్బుసాయం అందించింది. దీంతో ఎక్కువసార్లు భార్య ఆ ఇంటికి వెళ్లేది. ఇది గమనించిన భర్త తన భార్య కూడా తప్పు చేస్తోందనే అనుమానం పెంచుకున్నాడు. నిజం చెప్పాలంటూ భార్యను పలుమార్లు బెదిరించాడు. చివరకు మద్యంలో విషం కలుపుకుని తాగి చనిపోయాడు. ఫలితంగా భార్యాపిల్లలు రోడ్డున పడ్డారు.

వివాహేతర సంబంధంతో అలజడి



భార్యను దూరం పెట్టిన ఓ భర్త సహ ఉద్యోగినితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రహస్యంగా ఆ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈ విషయం సహజీవనం చేస్తున్న యువతి ప్రియుడికి తెలిసింది. తాను ప్రేమించిన యువతి డబ్బు మోజులో తనను మోసం చేసిందని స్నేహితులకు చెప్పుకుని ఏడ్చాడు. మిత్రుడి బాధను చూసి అంతా కలిసి స్కెచ్ వేశారు. ఉద్యోగిని మందు పార్టీకని పిలిచి అందులో విషం ఇచ్చి చంపేశారు. పోస్టుమార్టంలో అసలు నిజం వెలుగుచూసి వారందరూ అరెస్ట్ అయ్యారు. ఇక్కడ మృతుడి భార్య ఒంటరిదై పోయింది. ప్రేమించిన యువతి మోసంతో యువకుడు కటకటాలపాలయ్యాడు.

ఇవి మానవ సంబంధాల్ని దెబ్బతీస్తున్న కొన్ని ఘటనలు. మన మధ్యే జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలకు వెనుక ఉన్న యథార్థ గాథలు..!

– గుంటూరు డెస్క్

అనుబంధాల ఆర్తనాదం

• వివాహేతర సంబంధాలతో హత్యలు • అనుమానాలతో ఆత్మహత్యలు • ఆకర్షణకు లోనై కోల్పోతున్న విచక్షణ • ఛిద్రమవుతున్న వైవాహిక బంధాలు

సండే స్పెషల్

సమాజంలో బంధాలు, అనుబంధాలకు ఎంతో విలువ ఉంది. కొన్ని సందర్భాల్లో ఆత్మాశ, అనుమానం, వ్యామోహం ఈ విలువలను దిగజార్చేలా చేస్తున్నాయి. ప్రేమ పెళ్లిళ్లు, కొన్నిచోట్ల పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు సైతం వివాహేతర సంబంధాల వల్ల విచ్ఛిన్నమవుతున్నాయి. హద్దులు దాటాక ఊహించని పరిణామాలు జరిగి వ్యక్తుల జీవితాలు, కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రస్తుతం కాలంలో హత్యలు, ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఇందుకు వివాహేతర సంబంధాలే కారణం కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. అక్రమ సంబంధాలు, ఆస్తికోసం అడ్డు వస్తున్నారని భార్య లేదా భర్త ఒకరినొకరు చంపేందుకు కూడా వెనుకాడటం లేదు. ప్రపంచంలోనే ఆదర్శ కుటుంబ వ్యవస్థ కలిగిన దేశం మనది. నూరేళ్ల జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆశించి చేసుకున్న పెళ్లినాటి ప్రమాణాలు పటాపంచలవుతున్నాయి. ఫలితంగా ప్రాణంగా ప్రేమించిన వారు.. జీవితాంతం తోడుండాల్సిన



వారే తోడేళ్లవుతున్నారు.

బంధం బలపడాలంటే..

- దాంపత్యంలో దాపరికాలు ఉండకుండా చూసుకోవాలి.
- పొరపాట్లు జరిగినా.., అనుమానాలు.., అవమానాలు ఎదురైనా ధైర్యంగా ఉండాలి.
- భార్యాభర్తలు ప్రతిరోజు కొంత సమయం ఒకరికొకరు కేటాయించుకోవాలి.
- బాధ్యతల్లో పడి ప్రేమించే వారిని ఒంటరిగా వదిలేయకూడదు.
- మనస్పర్థలు వచ్చినా కూర్చుని మాట్లాడుకోవాలి.
- ఏమైనా పొరపాట్లు వచ్చినా అపోహలు తొలిగే ప్రయత్నం రెండువైపులా జరగాలి.
- ఎవరి తప్పు ఉందో తెలుసుకుని సున్నితంగా పరిష్కరించుకోవాలి.
- మరోమారు అలాంటి తప్పు జరగకుండా జాగ్రత్త పడాలి.
- పిల్లల ముందు అస్సలు గొడవ పడరాదు.
- ఎవరైనా మనసును ప్రభావితం చేస్తుంటే సున్నితంగా తిరస్కరించాలి.
- తనకు జీవిత భాగస్వామి, పిల్లలు ఉన్నారని, కుటుంబ బాధ్యత ఉందని గుర్తెరగాలి.
- వివాహేతర సంబంధాలు ఆర్థిక, సామాజిక, శారీరక, మానసిక అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయని గమనించాలి.

ఆదర్శమైన ఆ ఐదుగురు దంపతులు...

గుండె గుడిలో లక్ష్మీదేవి నిండిపోయి ఉంటుందని చాటుతూ వక్షస్థలంపై చోటిచ్చిన లక్ష్మీనారాయణుల్లా.. దేహంలో సగభాగం పార్వతీ అంటూ అర్ధనారీశ్వరుడైన గౌరీశంకరుల్లా.. దంపతుల ఇద్దరి మాట ఒకటేనంటూ సతీ సరస్వతిని నాలుకపై నిలిపిన బ్రహ్మదీసరస్వతుల్లా.. జీవకోటిని మేల్కొపుతూ పరుగులు పెట్టే భర్తను అనుసరించే భార్య ఛాయాదేవి, సూర్యుడిలా.. సర్దుకుపోయేతత్వం ఉన్న రోహిణిచంద్రుడిని ఆదర్శంగా తీసుకుని అందంగా, ఆనందంగా తీర్చుదిద్దుకోవాలి. మొత్తం మీద భార్య నుంచి భర్తకు కావాల్సింది ఉపశమనం, సాంత్వన, పోషణ, కాని భార్యకు భర్త నుంచి కావాల్సింది అనుక్షణం సం'రక్షణ' ఒక్కటే. పెళ్లినాటి ప్రమాణాలు, నియమాలు, ఒప్పందాలను మర్చిపోకుండా మంచి సమాజం కోసం కుటుంబాన్ని ఆదర్శవంతంగా కొనసాగించినపుడే ఆ దాంపత్యంలో ఆనందం చిరస్థాయిగా ఉంటుంది.

నమ్మకంతో మెలగాలి



దంపతులు ఒకరిపై మరొకరు నమ్మకంతో మెలగాలి. దంపతుల మధ్య దాపరికాలు ఉండకూడదు. సోషల్ మీడియాకు సాధ్యమైనంత దూరంగా ఉంటూ ఒకరితో ఒకరు ఎక్కువ సమయం గడపాలి. వృత్తికి, కుటుంబానికి సమపాళ్లలో సమయం కేటాయించాలి. భార్యాభర్తలు ఇంట్లో ఉన్నప్పుడు వ్యాయామం, భోజనం, అల్పాహారం కలిసి చేయడం ద్వారా ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడుతుంది. పండుగలు, వారంతపు సెలవుల్లో ఒక రోజు తప్పనిసరిగా కుటుంబ సభ్యులకు కేటాయించడం ద్వారా అంతరాలు తొలగిపోయి అనుబంధం బలపడుతుంది.

దాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, మానసిక వ్యాధి వైద్య నిపుణుడు, జీజీహెచ్, గుంటూరు

లక్ష్యాలతో ముందుకు సాగాలి

'ఏ డే విత్ కలెక్టర్'లో విద్యార్థులతో కలెక్టర్

నరసరావుపేట: విద్యార్థి దశలో ఉన్నప్పుడే లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఏ డే విత్ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో విద్యార్థులతో సమావేశమయ్యారు. వారిని పరిచయం చేసుకొని విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలకు చేరుకోవాలంటే అందుకు తగిన విధంగా అన్ని విషయాలపై పట్టుసాధించాలని పేర్కొన్నారు. ఉన్నత చదువులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) ద్వారా వివరించారు. మెదడుకు పదును పెట్టేలా విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి చక్కని జవాబులు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు.

సమష్టి కృషితోనే తిరునాళ్ల విజయవంతం

- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా ఎస్పీ రవిశంకర్, ఎమ్మెల్యే డాక్టర్‌గోపిరెడ్డి
- తిరునాళ్ల విధులు నిర్వర్తించిన అధికారులకు సత్కారం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

నరసరావుపేటరూరల్: సమష్టి కృషితోనే కోటప్పకొండ తిరునాళ్ల విజయవంతం అయిందని పలువురు పేర్కొన్నారు. వినుకొండ రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి అభినందన సభ నిర్వహించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు చేశారన్నారు. లక్షలాది మంది యాత్రికులు వచ్చినా ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికారులు, సిబ్బంది పనిచేశారన్నారు. జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణతోపాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా విధులు నిర్వర్తించిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ తిరునాళ్ల ఏర్పాట్లు తనకు సంతృప్తినిచ్చాయన్నారు. గతంలో వీఐపీలు దర్శనం కోసం సామాన్య భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. ఈ ఏడాది చేసిన ప్రత్యేక ఏర్పాట్లతో ఎలాంటి అసౌకర్యం లేకుండా భక్తులు దర్శనం చేసుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ తిరునాళ్లకు సుమారు 20 లక్షల మంది భక్తులు వచ్చారన్నారు. పల్నాడు జిల్లాగా ప్రకటించిన తరువాత జరిగిన మొదటి తిరునాళ్లను జిల్లా అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించారన్నారు. కొండపైన, దిగువన మున్సిపల్, పంచాయతీ సిబ్బంది చక్కగా నిర్వహించారని ప్రశంసించారు. తిరునాళ్ల విధులు నిర్వర్తించిన అధికారులు, సంక్రాంతి సంబరాలు, జాతీయ స్థాయి వృషభరాజముల ఎడ్ల పందాల నిర్వాహకులను సత్కరించారు. పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ బాబు, ఆర్అండ్‌బీ ఈఈ రాజానాయక్, డీఆర్‌ఓ వినాయకం, ఆర్డీఓ శేషారెడ్డి, డీఎఫ్‌ఓ రామచంద్రారావు పాల్గొన్నారు.


వైభవంగా నేతివెంకన్నస్వామి తిరునాళ్ల



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రులు కొట్టు, అంబటి, ఎంపీ లావు

రాజుపాలెం: నేతి వెంకన్న స్వామిగా ప్రసిద్ధికెక్కిన మండలంలోని దేవరంపాడుకొండపై మత్స్యరూపంలో వెలసిన వేంకటేశ్వరుని తిరునాళ్ల సందర్భంగా తొలి శనివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర జలనవరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎస్.శివశంకర్ తదితరులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. వీరికి వేదపండితులు మేళతాళాలు, పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. సమీప ప్రాంతాల నుంచే కాక సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. గోవిందనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. భక్తులు స్వామివారికి పొంగళ్లు పొంగించి నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో దేవదాయశాఖ నుంచి ఆలయంలో మండపం నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశామని అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వారి వెంట డీఎఫ్‌ఓ రామచంద్రరావు, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత, మాజీ ఎంపీపీ బాను లింగారెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి...



మృతుడు లతీఫ్

మార్టూరు: జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న కారు టైరు పేలి అదుపుతప్పడంతో ఓ యువకుడు మృతి చెందగా నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని కోనంకి ఇసుక దరిశి గ్రామాల మధ్యన శుక్రవారం రాత్రి జరిగింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని కుమ్మరిపాలెం కాలనీకి చెందిన షేక్ లతీఫ్ (24), ఎల్లగాల నరేంద్ర, కన్నెబోయిన అవినాష్, సురేష్, గోపి స్నేహితులు. వీరిలో లతీఫ్‌కు గల్ఫ్‌లో ఉద్యోగం రావడంతో రెండు నెలల్లో వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో అవినాష్ తన కాబోయే భార్యతోపాటు తన ముగ్గురు స్నేహితులతో కలిసి తిరుమల దైవ దర్శనానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం శుక్రవారం స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. నరేంద్ర కారు నడుపుతుండగా జాతీయ రహదారిపై కోనంకి సమీపంలోకి రాగానే కారు ముందు టైరు ఒక్క సారిగా పేలడంతో అదుపుతప్పి ముందు వెళుతున్న లారీని తాకుతూ వెళ్లి పల్టీ కొట్టింది. డ్రైవర్ పక్కన కూర్చొన్న లతీఫ్ తలకు గాయాలు కాగా మిగిలిన నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లతీఫ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.